RNI No: APTEL /25/A2860

సీమ వార్త సాయంకాలం

అనంతపురం | సంపుటి : 1 | సంచిక : 107 | పేజీలు : 4 | సోమవారం 19 అక్టోబర్ 2026 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | వెల : 2/-



భారత్‌కు 7 శాతం వృద్ధి సరిపోదు, 9 శాతం అవసరం

ఆర్థికవేత్త నూరియల్ రౌబినీ



ఓటర్ల జాబితాతో

బీజేపీ కుట్ర

- దొంగ ఓట్లను చేర్పిస్తూ, ప్రతిపక్షాల ఓట్లను తొలగిస్తున్నారని అఖిలేశ్ విమర్శ
- పోలింగ్ బూత్‌ల వద్ద కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని పిలుపు
- మోసం, నిజాయతీ లేకపోవడాన్నే బీజేపీ తన బలంగా భావిస్తుందని వ్యాఖ్య



రోడ్డును తలపించేలా హోర్డింగ్

- ఢిల్లీ-డెహ్రాడూన్ ఎక్స్‌ప్రెస్‌వేపై ఘోర ప్రమాదం
- ఢిల్లీ-డెహ్రాడూన్ ఎక్స్‌ప్రెస్‌వేపై హోర్డింగ్ రూపంలో ప్రమాదం
- రోడ్డుగా భ్రమపడి హోర్డింగ్‌ను ఢీకొట్టి ట్రక్కు డ్రైవర్ దుర్మరణం

స్థానిక సంస్థల్లోనూ కూటమికి

జై కొట్టండి



- సీఎం చంద్రబాబు పిలుపు
- ట్రిపుల్ ఇంజన్ సర్కారుతో అభివృద్ధి మూడు రెట్ల వేగంతో సాగుతుందని హామీ
- అభ్యర్థుల ఎంపికలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 63.6 శాతం స్థానాలు కేటాయింపు
- విద్యావంతులకు, విధ్వంసకారులకు మధ్య జరుగుతున్న పోరు ఈ ఎన్నికలు
- గత ప్రభుత్వ హయాంలోని అరాచకాలపై వీడియోలను ప్రదర్శించిన ముఖ్యమంత్రి

అమరావతి

సార్వత్రిక ఎన్నికల మాదిరిగానే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఎన్డీఏ కూటమికి పట్టం కడితే, కేంద్రం, రాష్ట్రం, స్థానిక ప్రభుత్వాల కలయికతో 'ట్రిపుల్ ఇంజన్' వేగంతో అభివృద్ధి పరుగులు పెడుతుందని ముఖ్య మంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. ప్రజాస్వామ్య పునాదుల ను మరింత పటిష్ఠం చేసేలా ఈ ఎన్నికల ఫలితాలు ఉండాలని ఆకాంక్షించారు. సోమవారం అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎన్నికలతో క్షేత్రస్థాయిలో నాయకత్వం బలపడుతుందని, అందుకే సమర్థవంతమైన నాయకత్వాన్ని ప్రజలకు అందించాలనే లక్ష్యంతో అభ్యర్థుల ఎంపికలో ఎన్నడూ లేనంత కసరత్తు చేస్తున్నామని వివరించారు. పట్టణ స్థానిక ఎన్నికల్లో మాదిరిగానే గ్రామీణ ఎన్నికల్లోనూ ఇదే స్థాయిలో కసరత్తు చేస్తామన్నారు. 'ఆయారాం గయారాం' సంస్కృతికి స్వస్తి పలుకుతూ, - మిగతా3లో



రోడ్డు ధ్వంసం చేసిన వారిపై నాన్ బెయిలబుల్ కేసు పెట్టండి..

- నష్టాన్ని వారి నుంచే వసూలు చేయండి
- తిరుపతి జిల్లాలో కొత్తగా వేసిన రోడ్డును ధ్వంసం చేసిన ఘటన
- వైసీపీ నేత సుబ్బారెడ్డిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదుకు పవన్ ఆదేశం
- నష్టాన్ని నిందితుల నుంచే వసూలు చేయాలని అధికారులకు సూచన
- ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం క్షమించరాని నేరమన్న డిప్యూటీ సీఎం
- 'పల్లె పండుగ 3.0' కింద వారం క్రితమే రోడ్డు నిర్మాణం

స్థానిక ఎన్నికల్లో కేంద్ర బలగాల మోహరింపుపై వైసీపీకి ఎదురుదెబ్బ

పిటిషన్ కొట్టేసిన హైకోర్టు

సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సమర్థించిన డివిజన్ బెంచ్

ఏపీలో పరిస్థితులు పశ్చిమబెంగాల్‌లా లేవని వాదించిన ప్రభుత్వం

రాష్ట్ర పోలీసులతోనే ఎన్నికల భద్రత



50 డిగ్రీలకు చేరనున్న ఎండలు?



- గోదావరి నీటి నిల్వపై మంత్రి తుమ్మల కీలక ప్రకటన
- సూపర్ ఎల్‌నినోతో ఎండలు 50 డిగ్రీలు దాటే అవకాశం ఉందని తుమ్మల వ్యాఖ్య
- వర్షాలు తగ్గితే భూగర్భజలాలు అడుగంటిపోయే ప్రమాదం
- గోదావరి నీటిని నిల్వ చేసేందుకు ప్రభుత్వం చర్యలు
- దుమ్ముగూడెం ఆనకట్టపై ఇసుక బస్తాలు ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశం
- భద్రాద్రి జిల్లా అమ్మగారిపల్లి వద్ద ఆనకట్టను మంత్రి పరిశీలన

హైదరాబాద్

తెలంగాణలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి భూగర్భజలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు 50 డిగ్రీలు దాటే అవకాశం ఉందని తెలిపారు. తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా గోదావరి నీటిని నిల్వ చేసే చర్యలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అమ్మగారిపల్లి వద్ద గోదావరి - మిగతా3లో



కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించిన కవిత.. ప్రభుత్వానికి హెచ్చరిక

- నవంబర్ చివరికల్లా కాఫర్‌డ్యామ్ నిర్మించాలని కవిత డిమాండ్
- లేదంటే పంప్‌హౌస్ వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరిక
- మేడిగడ్డను చూపి రైతులను నష్టపరచవద్దని ప్రభుత్వానికి సూచన

కరవు, ఎల్ నినో ఎఫెక్ట్..

కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు

- రంగంలోకి దిగిన టీజీ ప్రభుత్వం, ఆరుగురు మంత్రులతో కమిటీ
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కమిటీ చైర్మన్ బాధ్యతలు
- కమిటీలో మొత్తం ఆరుగురు మంత్రులకు చోటు
- కరవు పరిస్థితులను పర్యవేక్షించి ప్రభుత్వానికి సిఫారసులు చేయనున్న కమిటీ



హైదరాబాద్

రాష్ట్రంలో నెలకొన్న కరవు, ఎల్ నినో పరిస్థితులను సమీక్షించి, నివారణ చర్యలు చేపట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆరుగురు మంత్రులతో కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీకి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. ఈ సబ్ కమిటీలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి సభ్యులుగా ఉన్నారు. ముఖ్యమంత్రి సలహాదారు కె. రామకృష్ణారావు ప్రత్యేక ఆహ్వానితుడిగా వ్యవహరించనుండగా, ప్రణాళికా శాఖ కార్యదర్శి కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా కరవు పరిస్థితులను ఈ కమిటీ - మిగతా3లో

విజయ్ పార్టీకి రూ.13.3 కోట్ల విరాళాలు

- విజయ్ టీవీకేకు 2025-26లో రూ.13.3 కోట్ల విరాళాలు
- మొత్తం విరాళాల్లో ఆధవ్ అర్జున, ఆర్‌వీ రంజిత్‌కుమార్ నుంచే 99 శాతం విరాళాలు
- రూ.8.2 కోట్లు అందించిన ఆధవ్ అర్జున
- రంజిత్‌కుమార్ రూ.5 కోట్ల విరాళం

సోమవారం 19 అక్టోబర్ 2026

సీమ వార్త సాయంకాలం

అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా

జీనం కే "పచ్చ" ని పరిషత్ పగ్గాలు.

వెంకటరమణపల్లి ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీకి సిద్ధమైన నరేష్.

మండల నాయకుల సమక్షంలో మంత్రి కార్యాలయంలో... ఎంపీపీ అభ్యర్థి ఎంపిక.

గోరంట్ల అక్టోబర్ 19 సీమ వార్త సాయంత్రం.



తెలుగుదేశం పార్టీ తరపున గోరంట్ల మండల ఎంపీపీ అభ్యర్థిగా జీనం నరేష్ ఏకగ్రీవ ఎంపిక. గోరంట్ల మండలం తెలుగుదేశం పార్టీ మండల పరిషత్ అధ్యక్ష పీఠానికి అభ్యర్థిగా మాజీ సర్పంచ్, టిడిపి జిల్లా కార్యదర్శి జీనం నరేష్ ను ఎంపిక చేశారు. సోమవారం పెనుగొండ పట్టణంలోని మంత్రి కార్యాలయంలో మండల స్థాయి లీడర్ల సమక్షంలో టిడిపి ఎంపీపీ అభ్యర్థిగా నరేష్ ను ఏకగ్రీవ నిర్ణయించినట్లు నాయకులు తెలిపారు. ఎంపీపీ అభ్యర్థిగా ఎన్నికైన నరేష్ గతంలో పులేరు సర్పంచ్ గాను ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శిగా కొనసాగుతున్నారు.

కూటమి సర్కార్‌లోనే...

వడ్డెర్లకు సరైన స్థానం ..!!

.....స్థానిక సంస్థల ఎన్నికల్లో వడ్డెర సామాజిక వర్గానికి అవకాశం కల్పిస్తాం

పెనుగొండలో....మంత్రి సవిత.

పాల్గొన్న... నియోజకవర్గ అబ్జర్వర్ నరసింహారావు.

పెనుకొండ అక్టోబర్ 19 సీమ వార్త సాయంత్రం.

పెనుకొండ క్యాంపు కార్యాలయంలో గోరంట్ల మండలానికి చెందిన వడ్డెర సామాజిక వర్గ నాయకులు, కార్యకర్తలు మంత్రి సవితను కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గోరంట్ల మండలంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వడ్డెర సామాజిక వర్గానికి తగిన ప్రాధాన్యత కల్పించాలని వారు మంత్రిని కోరారు.ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ రాష్ట్రంలోనూ, నియోజకవర్గంలోనూ వడ్డెర సామాజిక వర్గానికి ఇప్పటికే తగిన ప్రాధాన్యత కల్పించామని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పదవితో పాటు గోరంట్లలో సింగిల్ విండో అధ్యక్ష పదవిని కూడా వడ్డెర సామాజిక వర్గానికి కల్పించినట్లు పేర్కొన్నారు.అదేవిధంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ వడ్డెర సామాజిక వర్గానికి తప్పకుండా అవకాశం కల్పిస్తామని మంత్రి సవిత హామీ ఇచ్చారు. కూటమి అభ్యర్థుల - మిగతా3లో





రాప్తాడు ఇలాఖాలో...

సైకిల్ ఎక్కుతున్న "పంకా" శ్రేణులు..!"



....వైసీపీకి షాక్.. రాప్తాడు టీడీపీలోకి ముమ్మరంగా వలసలు

....ఎమ్మెల్యే పరిటాల సునీత ఆధ్వర్యంలో పలువురు చేరికలు

....ఎంపీటీసీ అభ్యర్థుల ఎంపికపై కొనసాగుతున్న కసరత్తు

....రాప్తాడు, అనంతపురం రూరల్ పరిధిలోని స్థానాలపై స్పష్టత

పెనుగొండలో తోపులాట... డిక్లరేషన్‌పై రగడ..!!

..... వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ రాకతో ఉద్రిక్తత.

పెనుగొండ అక్టోబర్ 19 సీమ వార్త సాయంత్రం.

పెనుకొండ మున్సిపల్ కార్యాలయం వద్ద వైసీపీ వర్గాల తోపులాట చేసుకుంది. నాలుగో వార్డ్ వైసిపి కౌన్సిలర్ అభ్యర్థి భాస్కర్ నామినేషన్ పై ఎన్నికల అధికారి అభ్యంతరం తెలపడంతో వైసిపి పార్టీకి చెందిన సుమారు దాదాపు వంద మంది కార్యకర్తలతో అక్కడికి వైసిపి మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ చేరుకొని కొద్దిసేపు పోలీసులతో వాగ్వి వాగ్వాదం చోటు చేసుకుంది. ఎన్నికల అధికార వద్దకు చేరుకున్న ఉషశ్రీ చరణ్ నామినేషన్ పత్రాల్లో సరైన డిక్లరేషన్ లేదని గతంలో పంచాయతీల - మిగతా3లో

జనంలోకి....

చెప్పాం చేస్తున్నాం పిలుపు....!!

....పల్లె నుంచి పట్టణం వరకు ప్రగతి చూపడమే మన లక్ష్యం.

...ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నామన్న ఎమ్మెల్యే పరిటాల సునీత.

....చెప్పాం - చేస్తున్నాం ప్రచార కరపత్రాన్ని విడుదల.

.....విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆదేశించిన ఎమ్మెల్యే సునీత





అనంతపురం అక్టోబర్ 19 సీమ వార్త సాయంత్రం.

2024 ఎన్నికల్లో ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తోందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. నియోజకవర్గ ముఖ్య నాయకులతో కలిసి ఆమె 'చెప్పాం.. చేస్తున్నాం' అనే ప్రగతి నివేదిక కరపత్రాన్ని విడుదల చేశారు. అనంతపురం క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాప్తాడు నియోజకవర్గ వ్యాప్తంగా గృహ నిర్మాణం కింద 1,707 ఇళ్ళు, 4,334 మందికి ఇంటి స్థలాలు, 2,475 తాగునీటి కనెక్షన్లు, 13,261 విద్యుత్ కనెక్షన్లతో పాటు 7,260 మందికి నైపుణ్యాభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించామని వివరించారు. మౌలిక వసతుల పరంగా నియోజకవర్గంలో 149 కి.మీ. ఇంటి ముందు రోడ్లు, 46 కి.మీ. ప్రధాన రహదారులు, 12 కి.మీ. డ్రైనేజీ పనులతో పాటు కొత్త వీధి దీపాలను ఏర్పాటు చేసి గ్రామాల రూపురేఖలు మార్చామన్నారు. సూపర్ సిక్స్ పథకాల - మిగతా3లో

సీమ వార్త సాయంకాలం

సోమవారం 19
అక్టోబర్ 2026

స్థానిక సంస్థల్లోనూ కూటమికి జై కొట్టండి

-మొదటిపేజీ తరువాయి

మేయర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్లను ప్రజలే నేరుగా ఎన్నుకునే విధానాన్ని తీసుకొచ్చామని తెలిపారు. అభ్యర్థుల ఎంపికలో ప్రజాభీష్టానికి ప్రాధాన్యతనిస్తూ, సామాజిక పునరేకీకరణ (సోషల్ రీ-ఇంజనీరింగ్) చేపట్టామని చెప్పారు. ఇందులో భాగంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు 63.6 శాతం స్థానాలు కేటాయించామని, ఒక్క బీసీలకే 35 శాతానికి పైగా సీట్లు ఇచ్చి పెద్దపీట వేశామని వెల్లడించారు. విద్యావంతులు, యువత, మహిళలు, పార్టీకి సేవలందించిన వారికే టికెట్లు ఇచ్చామని, ప్రతి మేయర్ స్థానాన్ని ఒక్కో సామాజిక వర్గానికి కేటాయించామని చంద్రబాబు పేర్కొన్నారు.



చెప్పాం.. చేస్తున్నాం..

2024 సార్వత్రిక ఎన్నికల్లో 94 శాతం స్ట్రైక్ రేట్, 57 శాతం ఓట్ షేర్‌తో ప్రజలు చారిత్రాత్మక తీర్పు ఇచ్చారని గుర్తుచేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, పవన్ కళ్యాణ్‌తో కలిసి ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తూ సంక్షేమ పాలన అందిస్తున్నామని తెలిపారు. దేశంలోనే అత్యధికంగా సామాజిక భద్రత పింఛన్లు అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ అని, ఇది అతిపెద్ద నగదు బదిలీ కార్యక్రమమని కొనియాడారు. ఎంతమంది పిల్లలుంటే అంతమందికి 'తల్లికి వందనం' పథకాన్ని అమలు చేస్తున్నామని, అన్నదాత సుఖీభవ, స్త్రీశక్తి, దీపం-2.0 వంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు.

విశాఖ, విజయవాడల్లో సంపూర్ణ హక్కులతో ఇళ్ల పట్టాలు, 'రాజముద్ర'తో పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని వివరించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, డేటా సెంటర్ల నుంచి డిఫెన్స్ ప్రాజెక్టుల వరకు భారీ పెట్టుబడులను ఆకర్షిస్తూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. 2029 నాటికి 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని, గోదావరి-కావేరి అనుసంధానంతో దక్షిణాది రాష్ట్రాల నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

విద్యావంతులకు, గంజాయి బ్యాచ్‌కు మధ్య పోటీ

ఈ స్థానిక ఎన్నికలు విద్యావంతులకు, గంజాయి బ్యాచ్‌కు మధ్య జరుగుతున్న పోటీ అని చంద్రబాబు అభివర్ణించారు. అభివృద్ధి, సంక్షేమమే ఎన్డీఏ అజెండా అయితే, హింసను ప్రేరేపించడమే 'గొడ్డలి పార్టీ' విధానమని విమర్శించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఘోరంగా ఓడినా ఆ పార్టీకి బుద్ధి రాలేదని, స్థానిక ఎన్నికల్లోనూ విధ్వంసానికే ప్రాధాన్యత ఇస్తోందని మండిపడ్డారు. గొడ్డలి పార్టీ అధ్యక్షుడు తన అవినీతి, అక్రమాల నుంచి రక్షణ పొందేందుకే 'జెన్-జీ' అంటున్నారని, వారిని పావులుగా వాడుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. "గొడ్డలి పార్టీ చేసిన అకృత్యాల నుంచి జెన్-జీ కాపాడాలా?" అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో నాటి అక్రమాలను ప్రశ్నించిన ఎస్ఈసీపైనే ఎదురుదాడి చేసి, ఆయన ప్రాణరక్షణ కోసం కేంద్రాన్ని ఆశ్రయించే దుస్థితి కల్పించారని గుర్తుచేశారు. గత ప్రభుత్వంలో ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌తో భూములను దోపిడీ చేయాలని చూశారని, ప్రజల ఆస్తులపై నాటి సీఎం తన బొమ్మలు వేసుకున్నారని విమర్శించారు. దేవాలయాలను అపవిత్రం చేసి, కల్తీ ప్రసాదాలు తయారు చేయించారని, ప్రస్తుతం తాము పవిత్ర వాతావరణాన్ని నెలకొల్పుతున్నామని చెప్పారు.

కూటమి సర్కార్‌లోనే... వడ్డెర్ల కు సరైన స్థానం ..!!

-మొదటిపేజీ తరువాయి

విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు నరసింహారావు గారు కూటవి నాయకులు కార్యకర్తలు వడ్డెర కులస్తులు తదితరులు పాల్గొన్నారు...

జనంలోకి....చెప్పాం చేస్తున్నాం పిలుపు....!!

-మొదటిపేజీ తరువాయి

అమలులో రాప్తాడు నియోజకవర్గం అగ్రగామిగా ఉందంటూ---ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కింద రూ. 624.68 కోట్లు, తల్లికి వందనం ద్వారా రూ. 147.75 కోట్లు, అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ. 136.98 కోట్లు నేరుగా లబ్ధిదారులకు అందజేశామని సునీత తెలిపారు. వీటితో పాటు నియోజకవర్గంలో 4.60 లక్షల అన్న క్యాంటీన్ భోజనాలు, దీపం 2.0 కింద 97,123 ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ జరిగిందని, స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం విజయవంతంగా సాగుతోందన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఏవైతే హామీలు ఇచ్చామో, ఆ హామీలను నూటికి నూరు శాతం తప్పకుండా అమలు చేసి చూపిస్తున్నామని ప్రజలకు వివరించాలని ఈ సందర్భంగా పార్టీ శ్రేణులను వివరించారు. టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత, మహిళా, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వంటి 34 ప్రత్యేక విభాగాలను పూర్తిస్థాయిలో రంగంలోకి దిగాలన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ముస్లిం మైనారిటీలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి సదస్సులు నిర్వహించాలన్నారు. ఇంటింటి ప్రచారాన్ని ముమ్మరం చేయాలన్నారు. ప్రతి అభ్యర్థి స్థానిక సంస్థల ఓటర్ల మద్దతు కోరుతూ ఒక వీడియో రికార్డ్ చేయాలన్నారు. ఐటీ టీమ్ ఆధ్వర్యంలో 'మై టీడీపీ' యాప్ ద్వారా ఈనెల 27 వరకు జరిగే ఇంటింటి ప్రచారాన్ని, ప్రజల స్పందనను, లబ్ధిదారుల టెస్టిమోనియల్స్‌ను ఎప్పటికప్పుడు ట్రాక్ చేస్తూ ప్రచారాన్ని పర్యవేక్షిస్తారని ఎమ్మెల్యే సునీత తెలిపారు..

రాప్తాడు ఇలాఖాలో...

సైకిల్ ఎక్కుతున్న "పంకా" శ్రేణులు..!"

కనగానపల్లి అక్టోబర్ 19 సీమ వార్త సాయంత్రం.

రాప్తాడు నియోజకవర్గంలో స్థానిక ఎన్నికల సమరానికి టీడీపీ సరికొత్త వ్యూహాలతో దూసుకుపోతోంది. కేవలం అభ్యర్థుల ఎంపికకే పరిమితం కాకుండా, వైసీపీకి గట్టి షాక్ ఇస్తూ ముందుకు సాగుతోంది. ఎమ్మెల్యే పరిటాల సునీత ఆధ్వర్యంలో సోమవారం అభ్యర్థుల ఎంపికతో పాటు వైసీపీ నుంచి భారీ చేరికలు కూడా జరిగాయి. కనగానపల్లి మండలం ముక్తాపురం గ్రామంలో వైసీపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు గుజ్జల సురేష్, వినోద్ కుమార్, చిన్న నారాయణ, మధుసూదన్, భాస్కర్ లతో పాటు మరో 25మంది క్రీయాశీలక కార్యకర్తలు అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారు. స్థానిక వైకాపా నాయకుడు సుధాకర్, ముక్తాపురం పంచాయతీ తెలుగుదేశం నేతల సమక్షంలో తరలివచ్చిన వైసీపీ శ్రేణులకు ఎమ్మెల్యే పరిటాల సునీత పార్టీ కండువాలు కప్పి, సాదరంగా ఆహ్వానించారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం ఉంటుందని ఆమె భరోసా ఇచ్చారు. మరోవైపు అభ్యర్థుల ఎంపికలో భాగంగా ఇవాళ రాప్తాడు మండలంతో పాటు అనంతపురం రూరల్ లోని ఒక ప్రధాన క్లస్టర్ పరిధిలోని ఎంపీటీసీ స్థానాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. నియోజకవర్గం అంతటా ఏకపక్షంగా క్లీన్ స్వీప్ చేయడమే టార్గెట్‌గా ఈ సమీక్ష సాగింది. సామాజిక సమీకరణాలు, రిజర్వేషన్లతో పాటు స్థానికంగా ప్రజల్లో గట్టి పట్టున్న నాయకులను, కార్యకర్తల మద్దతు ఉన్నవారినే బరిలోకి దించుతున్నట్లు ఎమ్మెల్యే సునీత స్పష్టం చేశారు. స్థానిక నాయకత్వం పూర్తి సమ్మతితోనే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తామని తెలిపారు.

విజయ్ పార్టీకి రూ.13.3 కోట్ల విరాళాలు..

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌కు చెందిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీకి 2025--26 ఆర్థిక సంవత్సరంలో రూ.13.3 కోట్ల స్వచ్ఛంద విరాళాలు అందాయి. ఈ మొత్తంలో దాదాపు 99 శాతం ఇద్దరు మంత్రుల నుంచే వచ్చినట్లు భారత ఎన్నికల సంఘానికి సమర్పించిన వివరాలు వెల్లడిస్తున్నాయి. క్రీడలు, ప్రజాపనుల శాఖ మంత్రి ఆధవ్ అర్జున, మరో మంత్రి ఆర్‌వీ రంజిత్‌కుమార్ ఈ విరాళాల్లో ప్రధాన భాగస్వాములుగా ఉన్నారు. ఎన్నికల సంఘానికి సమర్పించిన వివరాల ప్రకారం.. ఆధవ్ అర్జున రూ.8.2 కోట్ల విరాళంగా ఇచ్చారు. రంజిత్‌కుమార్ రూ.5 కోట్లు అందించారు. దీంతో పార్టీకి అందిన మొత్తం విరాళాల్లో అర్జున వాటా 60 శాతానికి పైగా ఉంది. టీవీకేకు అత్యధికంగా విరాళం ఇచ్చిన వ్యక్తిగా ఆయన నిలిచారు. ఈ ఇద్దరి విరాళాలతో పాటు మరో రెండు విరాళాలు కూడా పార్టీకి అందాయి. తూత్తుకుడి జిల్లా లయన్స్ టౌన్‌లో ఉన్న స్నో షో సంస్థ రూ.5 లక్షలు డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా ఇచ్చింది. అదే చిరునామాలో నమోదైన స్నో ఎక్స్‌పోర్ట్స్ అండ్ ఇంపోర్ట్స్ సంస్థ కూడా మరో రూ.5 లక్షలు డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో అందించింది. ఓవరాల్ గా ఈ నాలుగు విరాళాల మొత్తం రూ.13.3 కోట్లుగా ఉంది. ఇదిలా ఉండగా 2025--26 ఆర్థిక సంవత్సరంలో అన్నాడీఎంకే సుమారు రూ.161.35 కోట్ల స్వచ్ఛంద విరాళాలు అందుకున్నట్లు ఎన్నికల సంఘం గణాంకాలు వెల్లడించాయి. ఇందులో టైగర్ అసోసియేట్స్ సంస్థ రూ.135 కోట్లతో అతిపెద్ద విరాళదారుగా నిలిచింది. డీఎంకేకు ఇదే ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.191.19 కోట్ల విరాళాలు అందాయి. ఆ పార్టీకి కూడా టైగర్ అసోసియేట్స్ అత్యధికంగా రూ.125 కోట్లు ఇచ్చింది. కోల్‌కతాకు చెందిన ఈ లాటరీ సంస్థకు, తమిళనాడు లాటరీ వ్యాపారవేత్త శాంటియాగో మార్టిన్‌కు వ్యాపార సంబంధాలు ఉన్నట్లు కంపెనీ రికార్డులు సూచిస్తున్నాయి. ఆ సంస్థలో నియమిత భాగస్వామిగా ఉన్న సుబ్బయన్ నాగరాజన్.. మార్టిన్‌కు చాలాకాలంగా వ్యాపార సహచరుడిగా ఉన్నట్లు సమాచారం. సుప్రీంకోర్టు 2024 ఫిబ్రవరిలో ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దు చేసిన విషయం తెలిసిందే. అంతకుముందు ఆ బాండ్లను అత్యధికంగా కొనుగోలు చేసిన సంస్థగా మార్టిన్‌కు చెందిన ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్ సర్వీసెస్ సంస్థ నిలిచింది. పథకం రద్దు తర్వాత బహిర్గతమైన వివరాల ప్రకారం.. ఈ సంస్థ ఎన్నికల బాండ్ల ద్వారా డీఎంకేకు రూ.509 కోట్ల విరాళాలు అందించింది.

కన్నెపల్లి పంప్‌హౌస్‌ను

సందర్శించిన కవిత.. ప్రభుత్వానికి హెచ్చరిక

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈరోజు కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని కన్నెపల్లి లక్ష్మీ పంప్‌హౌస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నవంబర్ నెలాఖరు నాటికి ప్రాణహిత నీటిని మళ్లించేందుకు వెంటనే కాఫర్‌డ్యామ్‌ను నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో కన్నెపల్లి పంప్‌హౌస్ వద్దే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కరవు పరిస్థితుల్లోనూ అందుబాటులో ఉన్న నీటిని రైతులకు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆమె విమర్శించారు. మేడిగడ్డను ఒక భూతంగా చూపి రైతులను నష్టపరచవద్దని ప్రభుత్వానికి సూచించారు. తమ పార్టీ కేవలం విమర్శించడానికే పరిమితం కాలేదని, ప్రభుత్వానికి పరిష్కార మార్గాలు కూడా సూచిస్తోందని తెలిపారు. టీవీల్లో కనిపించడం కోసం కాకుండా, ప్రజల సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలనే ఉద్దేశంతోనే తాము పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వం తమ సూచనలను సీరియస్‌గా తీసుకుని రైతుల ప్రయోజనాల కోసం పనిచేయాలని విజ్ఞప్తి చేశారు.

50 డిగ్రీలకు చేరనున్న ఎండలు?

-మొదటిపేజీ తరువాయి

ఆనకట్టను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇవాళ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోదావరి నీటిని నిల్వ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించిందని చెప్పారు. దుమ్ముగూడెం ఆనకట్టపై ఇసుక బస్తాలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు వెల్లడించారు. వర్షాలు తగ్గి భూగర్భజలాలు పడిపోయే పరిస్థితి ఏర్పడితే వ్యవసాయంతో పాటు తాగునీటి సరఫరాపైనా ప్రభావం పడే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. నీటి కొరతను దృష్టిలో పెట్టుకుని తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకోవాలని రైతులకు సూచించారు. నీటి లభ్యత తగ్గితే విద్యుత్ ఉత్పత్తిపైనా ప్రభావం పడుతుందని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వరి సాగుకు దూరంగా ఉండాలని తుమ్మల సూచించారు. నీటి వనరులను జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే వేసవిలో తాగునీటి కష్టాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి వివరించినట్లు చెప్పారు. గోదావరి నీటిని నిల్వ చేసే ప్రయత్నాల్లో భాగంగా దుమ్ముగూడెం ఆనకట్టపై ఇసుక బస్తాలు ఏర్పాటు చేసే పనులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

భారత్‌కు 7 శాతం వృద్ధి సరిపోదు, 9 శాతం అవసరం

అమెరికాతో వాణిజ్య సంబంధాలు భారత్‌కు మరింత లబ్ధి చేకూరుస్తాయని అంచనా

2008 నాటి ప్రపంచ ఆర్థిక సంక్షోభాన్ని ముందుగానే ఊహించి 'డాక్టర్ డూమ్'గా పేరుపొందిన ప్రముఖ ఆర్థికవేత్త నూరియల్ రౌబినీ, భారత ఆర్థిక వ్యవస్థపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం భారత్ సాధిస్తున్న 7 శాతం వృద్ధిరేటు అద్భుతమే అయినా, దేశంలోని యువతకు తగినన్ని మంచి ఉద్యోగాలను సృష్టించడానికి ఇది సరిపోదని ఆయన అభిప్రాయపడ్డారు. ఇందుకోసం భారత్ తన వృద్ధిరేటును దాదాపు 9%కి పెంచుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఒక ఇంటర్వ్యూలో రౌబినీ మాట్లాడుతూ, "భారత్ ది ఒక గొప్ప విజయ గాథ. ఇది మరింత పెద్ద శక్తిగా ఎదిగేందుకు కావాల్సిన అన్ని అవకాశాలు ఉన్నాయి" అని ప్రశంసించారు. దేశీయంగా ఉన్న భారీ మార్కెట్, ప్రతిభావంతులైన మానవ వనరులు, స్థూల ఆర్థిక స్థిరత్వం, సంస్కరణల బాటలో పయనించడం వంటివి భారత్‌కు సానుకూల అంశాలని ఆయన పేర్కొన్నారు. అయితే, "7% వృద్ధి సరిపోదు. యువతకు నాణ్యమైన ఉద్యోగాలు భరోసా ఇవ్వాలంటే భారత్ 9% వృద్ధికి చేరువ కావాలి" అని ఆయన నొక్కిచెప్పారు.

ఉద్యోగ సృష్టికి తక్షణ చర్యలు అవసరం

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రాకతో శారీరక శ్రమతో కూడిన పనులతో పాటు, మేధోపరమైన ఉద్యోగాలు కూడా పెను మార్పులకు లోనవుతున్నాయని రౌబినీ హెచ్చరించారు. ఇలాంటి క్లిష్ట సమయంలో, కేవలం జనాభా ప్రయోజనం ఒక్కటే భారత్‌కు లాభం చేకూర్చదని, వేగవంతమైన ఉద్యోగ కల్పన ద్వారానే దాన్ని సద్వినియోగం చేసుకోగలమని ఆయన వివరించారు.

ఓటర్ల జాబితాతో బీజేపీ కుట్ర

సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ బీజేపీపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నికల్లో గెలిచేందుకు బీజేపీ కుట్రపూరితంగా ఓటర్ల జాబితాను తారుమారు చేస్తోందని, దొంగ ఓట్లను చేర్పించడంతో పాటు ప్రతిపక్ష మద్దతుదారుల ఓట్లను తొలగిస్తోందని ఆయన విమర్శించారు. లక్నోలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. పోలింగ్ బూత్‌ల వద్ద పార్టీ కార్యకర్తలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ఏవైనా అవకతవకలు గుర్తిస్తే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. "మోసం, నిజాయతీ లేకపోవడాన్నే బీజేపీ తన బలంగా భావిస్తుంది. అందుకే ఇలాంటి కుట్రలకు పాల్పడుతోంది" అని అఖిలేశ్ అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని ప్రకటించిన తర్వాత అఖిలేశ్ ఈ వ్యాఖ్యలు చేయడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఇటీవలే వేల కోట్లు ఖర్చుపెట్టి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పూర్తి చేసిన తర్వాత, మళ్లీ ఇప్పుడు ఏమాత్రం అవసరం ఏమొచ్చిందని ఆయన ప్రశ్నించారు. ఇది కేవలం బీజేపీకి అనుకూలంగా జాబితాను మార్చేందుకేనని ఆయన ఆరోపించారు.

రోడ్డును తలపించేలా హోర్డింగ్

ఢిల్లీ-డెహ్రాడూన్ ఎక్స్‌ప్రెస్‌వేపై వరుసగా జరుగుతున్న ప్రమాదాలు ప్రయాణికులలో తీవ్ర ఆందోళన రేకెత్తిస్తున్నాయి. తాజాగా, రోడ్డు పక్కన ఉన్న ఒక హోర్డింగ్‌ను నిజమైన రహదారిగా భ్రమపడిన ఓ ట్రక్కు డ్రైవర్, దానిని బలంగా ఢీకొట్టి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. గత నెల రోజుల వ్యవధిలో అదే హోర్డింగ్ వద్ద చోటుచేసుకున్న ఐదవ ప్రమాదం ఇది కావడం గమనార్హం. రాత్రి సమయంలో ఢిల్లీ-డెహ్రాడూన్ ఎక్స్‌ప్రెస్‌వేపై వెళుతున్న సదరు ట్రక్కు డ్రైవర్, రహదారి పక్కన ఏర్పాటు చేసిన ఒక భారీ హోర్డింగ్‌ను గమనించాడు. ఆ హోర్డింగ్‌పై రోడ్డు డిజైన్ ముద్రించి ఉండటంతో, చీకటిలో అది నిజమైన మార్గమేనని అతడు భ్రమపడ్డాడు. దీంతో ట్రక్కును అటువైపుగా మళ్లించగా, అది వేగంగా వెళ్లి హోర్డింగ్ నిర్మాణాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో డ్రైవర్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఈ హోర్డింగ్ కారణంగా గత నెల రోజుల్లో మొత్తం ఐదు ప్రమాదాలు జరిగాయి. తాజా ఘటనతో కలిపి ఈ ప్రమాదాల్లో ఇప్పటివరకు ఇద్దరు మరణించగా, మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. ఒకే చోట పదేపదే ఒకే తరహా ప్రమాదాలు సంభవిస్తున్నా, సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాదం జరిగిన తీరు, సదరు హోర్డింగ్ నిర్మాణం వాహనదారులను ఏ విధంగా తప్పుదోవ పట్టిస్తోందో తెలిపే దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అత్యంత ప్రమాదకరంగా మారిన ఆ హోర్డింగ్‌ను తక్షణమే తొలగించాలని, ఇలాంటి అవాంఛనీయ ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.


స్థానిక ఎన్నికల్లో కేంద్ర బలగాల

మోహరింపుపై వైసీపీకి ఎదురుదెబ్బ..

ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో శాంతిభద్రతల కోసం కేంద్ర పారామిలిటరీ బలగాలను మోహరించాలని కోరుతూ వైసీపీ దాఖలు చేసిన పిటిషన్‌కు హైకోర్టులో మరోసారి చుక్కెదురైంది. సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ వైసీపీ వేసిన అప్పీల్ పిటిషన్‌ను హైకోర్టు డివిజన్ బెంచ్ ఈరోజు కొట్టివేసింది. స్థానిక ఎన్నికలను స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించడానికి కేంద్ర బలగాలు అవసరమని... రాష్ట్ర పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి తొలుత హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన సింగిల్ జడ్జి, అక్టోబర్ 16న దానిని కొట్టివేశారు. ఈ తీర్పును సవాలు చేస్తూ వైసీపీ డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. విచారణ సందర్భంగా, పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాల్లోని పరిస్థితులతో ఏపీని పోల్చలేమని, ఇక్కడ పారామిలిటరీ బలగాల అవసరం లేదని రాష్ట్ర ప్రభుత్వం వాదించింది. ప్రభుత్వ వాదనతో ఏకీభవించిన న్యాయస్థానం, రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి కేంద్ర బలగాలను మోహరించేంత తీవ్రంగా లేదని అభిప్రాయపడింది. సింగిల్ జడ్జి తీర్పును సమర్థిస్తూ డివిజన్ బెంచ్ కూడా అప్పీల్‌ను తోసిపుచ్చడంతో, స్థానిక ఎన్నికల భద్రత బాధ్యతలను రాష్ట్ర పోలీసులే నిర్వర్తించనున్నారు. దీంతో ఈ అంశంపై వైసీపీ చేసిన న్యాయపోరాటానికి నిరాశే ఎదురైంది.

కరవు, ఎల్ నినో ఎఫెక్ట్..

కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు



-మొదటిపేజీ తరువాయి

నిరంతరం పర్యవేక్షిస్తుంది. సంబంధిత శాఖలకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేయడంతో పాటు, తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి సిఫారసులు చేస్తుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలకు ప్రాధాన్యత ఇవ్వనుంది. అలాగే కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలపై నివేదికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేస్తుంది. నైరుతి రుతుపవనాల సమయంలో రాష్ట్రంలో 17 శాతం వర్షపాతం తక్కువగా నమోదు కావడంతో అనేక మండలాల్లో కరవు ఛాయలు అలుముకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం కరవు నివారణ చర్యలపై దృష్టి సారించి, ఈ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది.


పెనుగొండలో తోపులాట... డిక్లరేషన్ పై రగడ..!!



-మొదటిపేజీ తరువాయి

సుంకాల బకాయిల్లో అభ్యంతరం ఉన్నట్లు ఎన్నికల అధికారి ఉషశ్రీకి వివరించారు. అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నాయని తమరు కావాలని నామినేషన్ రిజెక్ట్ చేయాలని చూస్తున్నారని ఎన్నికల అధికారులతో ఉషశ్రీ చరణ్ వాదించారు. అయితే తెదేపా నాయకులు, వైసీపీ నాయకులు అక్కడికి చేరుకొని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు దీంతో పోలీసులు ఒక్కసారిగా ఇరువర్గాలని చెదరగొట్టారు.

వైయస్సార్సీపీ....పురం మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా షాజీయా.



హిందూపురం: అక్టోబర్ 19 సీమ వార్త సాయంత్రం. హిందూపురం మున్సిపల్ ఎన్నికలలో చైర్మన్ అభ్యర్థిగా షాజియాను ప్రకటించిన వైఎస్ఆర్సిపి పార్టీ అధిష్టానం. కాగా మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా శివాను ప్రతిపాదించిన స్థానిక నియోజకవర్గ నాయకులు అధిష్టానం ఆదేశాల మేరకు మార్పు చేశారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గౌరవాధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల తో పార్టీలిరీజినల్ కో-ఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి సూచన మేరకు వైయస్సార్సీపీ హిందూపురం నియోజకవర్గ ఇంచార్జ్ దీపిక వేణు రెడ్డి అభ్యర్థిగా షాజయా ను ప్రకటించారు. మున్సిపల్ ఎన్నికలలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున హిందూపురం మున్సిపాలిటీ చైర్మన్ అభ్యర్థిగా నియమితులైన ణ.షాజియా ఔ/గా డాక్టర్ భాష ను అధికారికంగా ప్రకటించి ఈ మేరకు ప్రచారం మొదలు పెట్టారు.

సీమ వార్త సాయంకాలం

సోమవారం 19
అక్టోబర్ 2026

అఖిలపక్ష రాజకీయ పార్టీల నేతలతో సమావేశం.

రిటర్నింగ్ అధికారి ప్రకాష్ లతోపాటు మండల స్థాయి అధికారులతో సమావేశం



గోరంట్ల అక్టోబర్ 19 సీమ వార్త సాయంత్రం. ప్రస్తుత స్థానిక ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని మండల పరిషత్ కార్యాల సమావేశ భవనంలో సోమవారం మండల రాజకీయ పార్టీల అఖిలపక్ష సమావేశాన్ని అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల రిటర్నింగ్ అధికారి ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో కమల భాయ్, తాసిల్దార్ మధు నాయక్, సిఐ బోయ శేఖర్, ఎస్సై నిర్మల లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మండలములోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల నియమావళి పై రాజకీయ పార్టీ నేతలకు సూచించారు.

తాడిపత్రి 11వ వార్డులో ఫేక్ న్యూస్ కలకలం

సిపిఐ నామినేషన్ విత్ డ్రా చేయలేదు



తాడిపత్రి అక్టోబర్ 19 సాయంకాలం(సీమ వార్త): తాడిపత్రి మున్సిపల్ ఎన్నికల్లో 11వ వార్డులో ఫేక్ న్యూస్ కలకలం రేపింది. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) అభ్యర్థి గడ్డం కృష్ణవేణి వైస్సార్ కాంగ్రెస్ పార్టీ పొత్తుతో నామినేషన్ వేశారు. అయితే నిన్నటి నుండి సోషల్ మీడియాలో కొంతమంది ఆకతాయిలు 11వ వార్డు సిపిఐ అభ్యర్థి నామినేషన్ విత్ డ్రా చేసుకున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని. దీనిపై సిపిఐ పార్టీ తీవ్రంగా స్పందించింది. ఈ సందర్భంగా చిరంజీవి యాదవ్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ గా ఒక్కసారి నామినేషన్ వేశామంటే తాడోపేడో తెలుసుకుంటాం తప్ప, నామినేషన్ విత్ డ్రా చేసే ఆలోచన కూడా కమ్యూనిస్టులకు రాదని. కమ్యూనిస్టులు ఎప్పుడూ ముందుకే నడుస్తారు కానీ వెనక్కి తగ్గరని బురద జల్లేందుకు కొంతమంది ఇలా తప్పుడు మెసేజ్ లు సోషల్ మీడియాలో పెడుతున్నారని మండిపాడారు . 11వ వార్డు ఓటర్లు, ప్రజలు ఈ ఫేక్ ప్రచారాన్ని నమ్మవద్దని, గమనించాలని సిపిఐ పార్టీ తరపున విజ్ఞప్తి చేస్తున్నామని అయన అన్నారు. అభ్యర్థి గడ్డం కృష్ణవేణి పోటీలోనే కొనసాగుతారని సిపిఐ పార్టీ స్పష్టం చేసింది.


దసరా పర్వదినాన కుట్టు మిషన్లకు పూజలు

పేద ఆడబిడ్డలకు విఆర్ ట్రస్ట్ అండతో స్వావలంబన దిశగా అడుగులు



తాడిపత్రి అక్టోబర్ 19 సాయంకాలం (సీమ వార్త): తాడిపత్రిలో మహిళా సాధికారతకు నిదర్శనంగా నిలుస్తోంది విఆర్ సేవా ట్రస్ట్. గాంధీ జయంతి అక్టోబర్ 2వ తేదీ పేద ఆడబిడ్డల కోసం ప్రారంభించిన ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమం విఆర్ సేవా ట్రస్ట్ కార్యాలయంలో విజయవంతంగా కొనసాగుతోందని రామిరెడ్డి గారు తెలిపారు. విఆర్ రామిరెడ్డి , విఆర్ వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఉచిత శిక్షణ కేంద్రం నడుస్తోంది. ప్రస్తుతం మొదటి విడతలో 30 మందికి పైగా పేద మహిళలు ఈ శిక్షణను ఉచితంగా పొందుతున్నారు. పవిత్ర దసరా పండుగ, నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం ట్రస్ట్ కార్యాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళా ట్రైనర్ చంద్రికా దేవి మరియు శిక్షణ పొందుతున్న అభ్యాసకులతో కలిసి కుట్టు మిషన్లకు పసుపు, కుంకుమలతో భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ “గాంధీ జయంతి నాడు సేవా భావంతో మొదలుపెట్టిన ఈ చిన్న ప్రయత్నం నేడు దసరా పండుగ నాటికి ఇంతమంది ఆడబిడ్డలకు ఉపాధి మార్గం చూపడం సంతోషంగా ఉంది. మన పేద ఆడబిడ్డలు నేర్చుకుంటున్న ఈ నైపుణ్యం వారి జీవితాల్లో విజయాలను, ఆర్థిక స్వావలంబనను తీసుకురావాలని మనసారా ఆశిస్తున్నాము. శిక్షణ పూర్తయిన తర్వాత అర్హులైన వారికి స్వయం ఉపాధి కోసం కుట్టు మిషన్లు కూడా అందజేస్తాము” అని అన్నారు. అలాగే తాడిపత్రి ప్రజలకు, ఆత్మీయ సోదరులకు, సోదరీమణులకు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విఆర్ ట్రస్ట్ సభ్యులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల చైర్మన్ పరిశీలనలో నాలుగు నామినేషన్లు తిరస్కరణ



మడకశిర అక్టోబర్ 19 సీమ వార్త సాయంకాలం మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల పూర్తి అయిన అనంతరం సోమవారం పరిశీలన కార్యక్రమాన్ని ఎన్నికల అధికారులు చేపట్టారు. ఈ పరిశీలనలో నాలుగు నామినేషన్లు తిరస్కరణకు గురి అయినట్లు ఎన్నికల అధికారి శ్రీనివాస భాస్కర్ తెలిపారు. ఎన్నికల నియమావళి నిబంధనల ప్రకారం పూర్తిస్థాయిలో దరఖాస్తును పూర్తి చేయకపోవడంతో పై అధికారుల ఆదేశాల మేరకు నాలుగు నామినేషన్లను తిరస్కరించినట్లు తెలిపారు. మొత్తం 13 నామినేషన్లు చైర్మన్ స్థానానికి దాఖలు కాగా సోమవారం 4 నామినేషన్లు తిరస్కరణకు గురి కావడంతో మిగతా నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు ఎన్నికల అధికారి శ్రీనివాస భాస్కర్ తెలియజేశారు. తిరస్కరణకు గురి అయిన నామినేషన్లు జనసేన పార్టీకి సంబంధించిన నామినేషన్లుగా గుర్తించడం జరిగిందన్నారు.

తాడిపత్రి మున్సిపాలిటీ నామినేషన్ల స్క్రూటినీ షురూ

అధికారుల పరిశీలనలో కొనసాగుతున్న నామినేషన్ పత్రాల పరిశీలన



తాడిపత్రి అక్టోబర్ 19 సాయంకాలం: తాడిపత్రి మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం మున్సిపాలిటీ కార్యాలయంలో నామినేషన్ల స్క్రూటినీ (పరిశీలన) ప్రక్రియ ప్రారంభమైంది. ఎన్నికల అధికారులు అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. నామినేషన్లలో తప్పులు, అసంపూర్ణ సమాచారం, సరైన పత్రాలు లేకపోవడం వంటి అంశాలను అధికారులు నిశితంగా గమనిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ తరఫున తాడిపత్రి మున్సిపల్ చైర్ పర్సన్ నామినేషన్ దాఖలు చేసిన మాజీ వైస్ చైర్ పర్సన్ ఎల్లుట్ల షేక్షావలి నామినేషన్ ని స్క్రూట్నీ లో నామినేషన్ ని ఆమోదించరు. ఈ స్క్రూటినీ అనంతరం తిరస్కరణకు గురైన, ఆమోదం పొందిన నామినేషన్ల పూర్తి వివరాలను అధికారులు అధికారికంగా ప్రకటించనున్నారు. ప్రస్తుతం స్క్రూటినీ ప్రక్రియ కొనసాగుతోంది.

టెంకాయ తో నీరు చూపిస్తున్న యువకులు,

సమృద్ధిగా బోరు బావిలో నీరు,

మడకశిర అక్టోబర్ 19





సీమ వార్త నియోజకవర్గ వ్యాప్తంగా చాలా గ్రామాలలో ఇద్దరు యువకులు బోరు బావిలో నీరు చూపిస్తున్నారు. వివరాలకు వెళితే కర్ణాటక ప్రాంతం చిక్కబళ్లాపురం పట్టణానికి చెందిన యువకులు టెంకాయతో బోరుబావిలో నీరు సమృద్ధిగా ఉన్నట్లు తెలియజేస్తున్నారు, అదేవిధంగా యంత్రాల సహాయంతో కూడా వారు నీటిని గుర్తిస్తున్నట్లు కాంట్రాక్టర్ కెంచు యాదవ్ తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 70 వరకు బోరు బావులు నీరు తవ్వించడం జరిగిందని దానిలో 67 వరకు బోరు బావిలో నీరు సమృద్ధిగా పడినట్లు తెలియజేస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా బోరుబావాలో నీరు తవ్వించడానికి ప్రభుత్వ మంజూరు చేసిన బోర్లను ఇద్దరు యువకులు సహాయంతో నీటి జాడ చూపిస్తున్నట్లు తెలియజేశారు . ప్రభుత్వము ఎక్కడ బోరు బావి తవ్వించాలన్న ఇద్దరు యువకులకు తెలియజేయడంతో వారు టెంకాయ, యంత్ర సహాయంతో చూపిస్తున్నారని ఈ సందర్భంగా వారు తెలియజేస్తున్నారు.

పోటీ లేకుండానే 17 వార్డులు కైవసం చేసుకున్న టీడీపీ

నామినేషన్ల స్క్రూటినీలో 12 వైసీపీ నామినేషన్లు తిరస్కరణ

అధికారిక ప్రకటన రాకముందే సోషల్ మీడియాలో వైరల్




తాడిపత్రి అక్టోబర్ 19 సాయంకాలం: తాడిపత్రి మున్సిపాలిటీ ఎన్నికల్లో సంచలన పరిణామం చోటుచేసుకుంది. మున్సిపాలిటీ నామినేషన్ల స్క్రూటినీలో దాదాపు 12 వార్డుల వైసీపీ అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి అని విశ్వాసనీయ సమాచారం. దీంతో నిన్న 5 వార్డులు, ఈ రోజు 12 వార్డులు కలిపి మొత్తం 17 వార్డుల్లో టీడీపీ అభ్యర్థులు పోటీ లేకుండానే ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సమాచారం. అధికారికంగా ఎన్నికల అధికారుల నుండి ప్రకటన వెలువడాల్సి ఉండగా, అంతకు ముందే ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. స్క్రూటినీలో నామినేషన్లలో లోపాల కారణంగా వైసీపీ అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరించినట్లు తెలుస్తోంది. 17 వార్డుల్లో ఏకగ్రీవ విజయంతో తాడిపత్రిలో టీడీపీ తన హవాను చాటుకుందని, వైసీపీకి ఇది పెద్ద షాక్ అని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

మహిషాషిణి రూపం లో మారెమ్మ.

.....మహిషాసుర మర్దిని దేవి అలంకరణలో దర్శనమిచ్చిన శ్రీ మారెమ్మ దేవి

----వైభవంగా దేవీ నవరాత్రి వేడుకలు.. భక్తులకు అన్నదానం



గోరంట్ల అక్టోబర్ 19 సీమ వార్త సాయంత్రం. గోరంట్ల మండలం గుమ్మయ్యగారిపల్లిలో వెలసిన శ్రీ మారెమ్మ దేవి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలను ఆలయ అర్చకులు, శ్రీ మారెమ్మ దేవి ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ బి. దేవిరాజు స్వామి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం శ్రీ మారెమ్మ దేవి మహిషాసుర మర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.ఈ సందర్భంగా ఆలయంలో గోపూజ, కుంకుమార్చన, అభిషేకం తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో భాగంగా గుమ్మయ్యగారిపల్లికి చెందిన రత్నమ్మ, ఈశ్వరప్ప ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు అందరికీ కలగాలని భక్తులు ప్రార్థించారు.

మైనార్టీలం జిల్లా పరిషత్ లో మాకు ప్లేస్ ఇవ్వండి.

గోరంట్ల మండల జడ్పిటిసి స్థానాన్ని మైనార్టీలకు కేటాయించాలని వినతి.

పార్టీ ఆఫీసులో కన్వీనర్ బాలకృష్ణ చౌదరికి వినతిపత్రం అందజేసిన మండల మైనార్టీలు.





గోరంట్ల అక్టోబర్ 19 సీమ వార్త సాయంత్రం. గోరంట్ల మండలం నుంచి జిల్లా పరిషత్ లో స్థానం కల్పించే విధంగా జడ్పిటిసి స్థానాన్ని మండల మైనార్టీలకు కేటాయించాలని గోరంట్ల మండల మైనార్టీలు సోమవారం గోరంట్ల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల తెలుగుదేశం పార్టీ మైనార్టీ నాయకులు మల్లాపల్లి మహమ్మద్ ఆధ్వర్యంలో అజంతుల్లా, ఉమర్ ఖాన్, నబీ రసూల్, అమానుల్లా, వాటర్ ప్లాంట్ ఖలీమ్,దాదు, షామీర్ భాష, తదితరులు మండల కన్వీనర్ బాలకృష్ణతో పాటు పార్టీ జిల్లా కార్యదర్శి నరేష్, పాలసముద్రం సింగిల్ విండో అధ్యక్షులు బెల్లాల చంద్ర, మాజీ వైస్ ఎంపీపీ చింతా భాస్కర్ రెడ్డి, మాజీ సర్పంచ్ బాలకృష్ణ,లకు తమ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మైనార్టీలు మాట్లాడుతూ గతం నుంచి గోరంట మండలంలో మైనార్టీలు తెలుగుదేశం పార్టీకి అండగా నిలుస్తున్నారని మా రాజకీయ ఎదుగుదలకు పార్టీ మరియు పార్టీ నాయకులు ఉండగా నిలవాలని అందులో భాగంగా మండల జెడ్పిటిసి స్థానాన్ని మైనార్టీలకు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నూర్ మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

మల సముద్రం టీడీపీ

ఎంపిటిసి అభ్యర్థిగా రంగయ్య.

తీర్మానించి మండల కన్వీనర్ కు తెలియజేసిన... ఆ ప్రాంత గ్రామ నేతలు.



గోరంట్ల అక్టోబర్ 19 సీమ వార్త సాయంత్రం. మండలంలోని మనసుముద్రం తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ అభ్యర్థిగా బూదిలి వాండ్లపల్లి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు వడ్డే రంగయ్యను ఆ పంచాయతీ నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరితో మల సముద్రం ఎంపీటీసీ పరిధిలోని గ్రామాల పార్టీ నాయకులు ప్రత్యేక సమావేశమై రంగయ్యను తీర్మానిస్తూ ఆ విషయాన్ని మండల కన్వీనర్ కు సూచించినట్లు తెలిపారు.

అగాపే ఆశ్రమంలో అన్నదానం



యాడికి అక్టోబర్ 19 సీమ వార్త సాయంకాలం యాడికి మండల కేంద్రం కమలపాడు రోడ్డు రాఘవేంద్ర కాలనీలో ఉన్న అగాపే ఆశ్రమంలో కాయగూరలు పెద్ద రంగప్ప కుమారుడు నేతిబొట్టు రంగనాథ్ భార్య గోవిందమ్మ వీరి కుమారులు గణేష్ రఘు కోడలు దివ్య వీరి కుటుంబము యూట్యూబ్లోనూ న్యూస్ పేపర్లో ఫేస్బుక్లో ఇంస్టాగ్రామ్ లో ఆశ్రమం గూర్చి తెలుసుకొని వారు కూడా వారి వంతుగా అన్నదానం చేయాలని భావించి ఆశ్రమంలో ఉంటున్న పెద్దలను వారి తల్లిదండ్రులుగా భావించి, కుటుంబం అంతా కలిసి అగాపే ఆశ్రమంలోని వృద్ధులకు నిరాశ్రయులకు భోజనాలు ఏర్పాటు చేయించి, అన్నదానం చేశారు ఇందు నిమిత్తమై ఆశ్రమ ఫౌండర్ బత్తల ప్రసాద్ ఆశ్రమంలోని వారంతా వారికి రెండు చేతులెత్తి నమస్కరించి వారి కుటుంబం అంతటికి కృతజ్ఞతలు తెలిపారు.

గోరంట్ల మండల వైసీపీ జడ్పీటీసీగా...

పులేరు అరిఫా.

గోరంట్ల అక్టోబర్ 19 సీమ వార్త సాయంత్రం. గోరంట్ల మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జడ్పీటీసీ అభ్యర్థిగా మాజీ మిలిటరీ అధికారి భాషా భార్య అరిఫా ను ఎంపిక చేసినట్లు పార్టీ శ్రేణులు తెలిపారు. అరిఫా గతంలో గోరంట్ల మండల డాక్రా సంఘాల మండల వెలుగు సమైక్య అధ్యక్షురాలుగా పనిచేసిన అనుభవం ఉంది.దీంతో ఆమెను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది.మండల వైసీపీ నాయకులు ఏకగ్రీవంగా తీర్మానించి బరి లో దింపుతున్నట్లు తెలిపారు.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A2860 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881